


'రావ్ అండ్ రావ్ ఎడ్యుకేషనల్ ప్రమోటర్స్'లో నేను భాగస్వామిని, గుమాస్తాని, మా బాస్‌కి ఆంతరంగికుణ్ణి, ఆఫీసు బాయ్‌నీ, అన్నీను. ఆ మాటకొస్తే రావ్ అంటే మా బాస్. అండ్...రావ్ అంటే నేను. ఏదో బుల్లి వాటా. నా సేవలకి ఉబ్బితబ్బిబ్బయి వ్యాపారంలో నన్ను భాగస్వామిని చేసుకున్నారు బాస్. అంతేకానీ వ్యాపార రహస్యం చెప్పలేదాయన. ఎన్నోసార్లడిగాను. 'ఒరే అబ్బులూ (అది నా ముద్దుపేరు. ఆయన పెట్టిందే) సమయం సందర్భం రానీరా. డాబాకి-మేడకి, కారుకీ-జీపుకి, అసెంబ్లీకి-లోక్‌సభకి తేడా తెలీని వయసులో నిన్ను చేరదీసాను. యింతవాణ్ని చేసాను. నీ రుణం ఉంచుకోను. ఆ ఒక్క రహస్యం దాచుకుంటానా. ప్రస్తుతానికి భాగం అనుభవించు," అని నా ఉత్సాహాన్ని కొట్టిపారేసేవారు. నేను కూడా 'యస్ బాస్' అని ఆశ పెంచుకొనేవాణ్ని.

యింతకీ మా వ్యాపారం ఏమిటంటే.. పరీక్షల్లో దండయాత్రలుచేసే కుర్రకారుని మా బాస్ పాస్‌చేయిస్తారు. ఎలా చేయిస్తారోగానీ గొప్పగా చేయిస్తారు సబ్జెక్టుకు రెండొందలు పుచ్చుకుంటారు. చిత్రమేమిటంటే పరీక్షపోతే డబ్బు వాపసు యిచ్చేస్తారు. అదే మా వ్యాపారంలోని పెద్ద ఆకర్షణ. అందుకే క్లయింట్సు సంఖ్య నానాటికీ పెరుగుతూ

వస్తుంది. మా బాస్‌లాకాదు. ఆయన కంటే గొప్ప వ్యాపారస్తుణ్ని కావాలనేది నా చిరకాల వాంఛ.

మెట్లమీదనుంచి బాస్ పిలిచేవరకూ నే నీ లోకంలోలేను. "అరే అబ్బులూ చూడూ, ఎవరో బజర్ నొక్కుతున్నారు. క్లయింటులా ఉంది." "యస్ బాస్" అని లేచి గుమ్మంవైపు వెళ్లాను. బాస్ క్లయింటువాసన యిట్టే పసిగడ్తారు. "మే ఐ కమిన్ ప్లీజ్" అన్నాడో వెటరనే. "రండిసార్. తలుపులు తీసే ఉన్నాయిగా," అని నవ్వుతూ ఆహ్వానించాను. బాస్ డ్రాయింగ్‌రూం అలకరించారు. "నా పేరు వెంకటరత్నం. విశ్వనాధంగా రి ఉత్తరం యిచ్చారు"

"అర్థమయింది. ఏ కుర్రాడు ఏ పరీక్షకి ఎప్పుడు వెళ్ళాడు? నంబరెంత?"

"ఏం చెప్పకుంటే ఏం లాభంలెండి. నాకు నమ్మకం లేదు."

"అంత గడ్డు కేసా? అబ్బులూ వీరికి కోకాకోలా యివ్వు".

"అలాగే బాస్." యిచ్చాను.

"వాడికి బీకాంలో ఎకనమిక్సు మిగిలిపోయింది. నాలుగుసార్లు పరీక్షకి కూర్చున్నాడు. ప్రతిసారీ రెండుమూడు మార్కుల తేడాతో ఫెయిలవుతున్నాడు, నాకు విసుగెత్తి వాడిచేత కిళ్ళీకొట్టు పెట్టించాలనుకుంటున్నా"

"ఎందుకు? మాకో అవకాశం యిచ్చి చూడండి. రెండు మూడు మార్కుల్లో పోతుంటే—మిగతా మార్కులు వేయించి పాస్ చేయిస్తా."

"అయితే ఈ 'మే'కి పరీక్ష కట్టిస్తా."

"చూడండి. మా సంస్థలో గొప్ప తనం చెప్పకోకూడదు. తప్పనిసరిగా పాస్‌చేయిస్తామని హామీ ఎవరికి యివ్వము... యిందులో మాకు మిగిలి వచ్చేదిలేదు. యిక్కడ డబ్బు తీసుకుంటాం. అక్కడ లంచాలు పెడతాం. నాలుగైదు మార్కుల తేడాతో పోయే కుర్రాళ్ళకి సాయంచేస్తాం. అంతకంటె ఎక్కువ మార్కులకి అక్కడా రిస్కు తీసుకోరు. కుర్రాడు పాసవ్వకపోతే డబ్బు తిరిగి యిచ్చేస్తాం. ఎలా ఉందంటారు?"

"చాలా చిత్రంగా ఉంది."

"మీ అబ్బాయి నంబర్ పేపర్లో చూసుకుంటే యింకా చిత్రంగా ఉంటుంది."

"అన్నట్టు రేటెంత ?"

"సబ్జెక్టుకి రెండువందలు."

"రెండుకాదు నాలుగు తీసుకోండి. ప్రస్తుతానికి రెండువందలు ఉంచండి. పాసయింతర్వాత మిగిలిన రెండువందలు బహుమతిగా యిస్తాను."

"ఎంతమాట. అలా కాకపోతే మీ సొమ్ము తిరిగియిస్తాను."

"అశుభానికి చోటివ్వకండి. మా అబ్బాయి పాసవుతాడనే గారంటీ యివ్వండి"




"మీ ఉత్సాహమే మా వ్యాపారానికి వెన్నెముక."

"అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శనంటారు. జాతీయం అయినవీ కానివీ అన్ని బాంకుల్లో చచ్చేంత పరపతి ఉంది. కానీ వాడికి బీకాం ఆమడదూరంలో ఉండిపోయింది."

"దిగులు పెట్టుకోకండి మీ అబ్బాయి పాసయి వృద్ధిలోకి వస్తాడు. మా సంస్థకి గర్వకారణమవుతాడు."

"మంచిదండీ. అవునూ... నాకో సందేహం."

"శెలవివ్వండి."

"ప్రమోటర్స్ అని పేరు పెట్టుకొని యింత బాహాటంగా ఎలా చేస్తున్నారండీ పనులు."

"చంపేశారు. యింత రహస్య వ్యాపారం మరొహటి లేదు. తెలిసిన వాళ్ళ ఉత్తరాలద్వారా వస్తేనే ప్రవేశం. పై పురుగుకి ప్రవేశంలేదే."

"నిజంగా?"

"కాగితాలమీద మా సంస్థ ఏమిటో అడగరేం."

"చెప్పండి."

"పాపం, బీద విద్యార్థులకి తక్కువ వడ్డీలమీద పైచదువులకోసం ఋణాలిప్పిస్తుంది."

"గొప్ప మోసం," అన్నాడు నవ్వుతూ.

"మరేనండి, ఏదో పొట్టతిప్పలు. నా జానెడు పొట్టకోసం వీడి జానెడు పొట్టకోసం ... యింట్లోవాళ్ల జానెడు జానెడు పొట్టలకోసం — చెయ్యాలి తప్పదు."

"చాలా చమత్కారి మీరు".

"అబ్బాయికి మీరిలా ప్రయత్నించినట్టు చెప్పకండి. కష్టపడి చదవమనండి మనం కుర్రాళ్లని చేతులారా పాడుచెయ్యకూడదు."

"యిలాంటి సలహా ఎవరూ యివ్వలేదు. ఆశ్చర్యంగా ఉంది."

"అవునండి. అబ్బాయి పరీక్ష రాసిం

తర్వాత నంబరివ్వండి. పరీక్ష ఫలితాలకి వారంముందే మీకు కబురంపుతాను."

"మరి శెలవు" ఆయన నిష్క్రమించాడు బాస్ వివరాలన్నీ బ్లాక్ రిజిష్టర్‌లో వ్రాసుకున్నారు. మళ్ళీ మరో ఖాతాదారు తయారు

"నా పేరు లక్ష్మీపతి," అంటూ ఉత్తరం యిచ్చాడు బాస్‌కి బాస్ ఆయనకి కోకాకోలా యిమ్మన్నారు. ఆయనకి అందించాను. సేవించి "సబ్జెక్టుకి ఎంత?" అని అడిగారు.

"రెండువందలు."

"మైగాడ్. యిటీజ్ టూమచ్."

"మీకు టూమచ్‌గా ఉంటుంది కానీ మా బాధలు ఎవరికి తెలుసు? ఎన్ని గుమ్మాలు తొక్కాలి. ఎందరికి పంచాలి. మాకేం మిగిలిచావదు"

"చూడండి, నేనో బీద గుమాస్తాని. నా తమ్ముడి భవిష్యత్తుమీద కొండంత ఆశతో వచ్చాను. వాడికి కెమిస్ట్రీ ఒకటే డౌటు. ఒక్క వందతో తృప్తిపడండి."

"క్షమించాలి. డబ్బు విషయంలో పైమాటలేదు"

"ఒక్కసారి ఆలోచించండి."

"లక్ష్మీపతిగారూ, మీరు కేసు యివ్వండి. యివ్వకపోండి షరతులు వినండి రెండువందల చొప్పున తీసుకొని నాలుగైదు మార్కుల తేడాతో పోయినవాళ్లకి సాయంచేస్తాం. పని జరక్కపోతే డబ్బు వాపస్ యిస్తున్నాం కాదా. మార్జిన్ నాలుగైదు మార్కులు గాబట్టి కుర్రాడు కష్టపడి చదవాలి."

"ఏమన్నారూ? కుర్రాడు కష్టపడి చదవాలా. దిక్కుతోచక చీకట్లో తడుముకుంటున్న నాకు చక్కటి ఆశాకిరణం చూపించారు. అంత యిచ్చుకోలేను. వాణ్ని రాత్రింబగళ్ళు తోమి చదివించుకుంటాను ఎందుకు పాసవ్వడో చూస్తాను."

"వెరీగుడ్. మేం కాదంటామా?"

"వస్తాను."

"ఆగండి కన్సల్టేషన్ ఫీజు ఒక రూపాయి ఆ డబ్బీలో వెయ్యండి."

"యిది అందరికీ వర్తిస్తుందా?"

"అఫ్‌కోర్స్. పోయిన కేసులకే."

"అంటే కోకాకోలా ఖర్చన్నమాట.

"అలా అని ఎలా అనగలం... ఏదో..."

"ఇదుగో" అని సర్రున రూపాయి తీసి డబ్బీలో వేసి దూసుకుపోయాడు.

"కేసు జారిపోయింది, బాస్. రెండోవంద వాయిదాల పద్ధతి మీద ఏర్పాటుచెయ్యాల్సింది."

"మంచి అయిడియా. వాయిదాలంటే మిడిల్ క్లాసుకి పెద్ద మోజు. కళ్ళుమూసుకుని విమానం కొనడానికికూడా సిద్ధపడతారు"

మరో క్లయింటు కనిపించాడు. ఎవరో పల్లెటూరి ఆసామీ. ఒళ్ళంతా బంగారు మలామా, అరచెయ్యంత పులి

గోరు. మెడలో రెండు విడివిడి గొలుసులు. చెవులకి బంధపోగులు, చేతులకి బంగారు కడియాలు, బాస్ చూసి కేసు బంగారమయి ఉంటుం దన్నారు.

"అంటే అన్ని సబ్జెక్టులూ పోయి ఉంటాయా బాస్?" అన్నాను. ఆయన నవ్వి "చూద్దాం" అన్నారు గొడుగు మూసుకుంటూ లోపలికి వచ్చాడు ఆసామీ "రండి రండ"ని ఆహ్వానించి బాస్ముందు కూర్చోబెట్టాను.

"విశ్వనాథంగారి ఉత్తరం యిచ్చారు. యివరాలన్నీ దాన్లో ఉన్నయ్."

"అబ్బాయి పరీక్షకు వెళ్తున్నాడండీ"

"ఆయ్. దాన్లో లేదాండే ఆడెన్ని సార్లు చెప్పినా గుర్తుండదు.''

"బిఎస్సీనా?"

ఆయ్. అదేనండీ. నోట్లోఆడతంది."

"రెండు పరీక్షలు పోయినట్టు రాశారు"

"ఆయ్. నాకు తెలవదండే. మీరూ మీరూ సూసోకోండి డబ్బిడమే నా పని. అణ్ని గంగలో ముంచండి, నాకు తెలవదు. యదవ యదవ యదవన్నరని. అడికి సదువు రాదండి.''

''అబ్బులూ వీరికి..."

"కోకాకోలా యిస్తున్నా బాస్" అని యిచ్చాను తాగి "డబ్బెంతండే?"

"నాలుగు వందలు''.

"ఆయ్. ఆంతియ్యను!''

"అయితే."

"ఎయ్యి–ఎయ్యి రూపాయలిత్తాను."

ఉండబట్టలేక 'బాబోయ్' అన్నాను నేను. ఆసామీ కుర్చీలోంచి లేచిపోయాడు బాస్ నవ్వి "వాడంతే. పగటి నిద్ర. పైగా కలవరింతలూ" అన్నారు. "అంతే బాస్" అన్నాను. ఆయన కూర్చొని "ఎంతిత్తానని చెప్పాను."

"వెయ్యి రూపాయలు."

"ఆయ్. ఒక సరతు. ముందు డబ్బి య్యను ప్యాసయితే క్యాసిత్తాను. కావాలంటే నోటు రాయించుకోండి."

"ఎంతమాట. నోటు అక్కరలేదు. మీ నోటిమాట చాలు. మీకే ఈ సదు పాయం. ఎవరికీ ఉరువు పెట్టం"

అరువు కాదండే. మిగతా ఆరొందలు మీకు నా బగుమతి.''

"సరే. అబ్బాయికి మీ ప్రయత్నం తెలియనివ్వకండి. బాగా చదవమనాలి."

"అదెట్టాగండి. ఆడు సదివితే మీదగ్గరెక్కెందు కొత్తా."

"మీ వాణ్ని కష్టపెట్టాలని కాదు. మన కృషి మనది. వాడి కృషి వాడిది. ఏమంటారు?"

"ఏటంటాను మీరు చెప్పాక" అని వెళ్ళిపోయాడు గొడుగు విప్పుకుంటూ.

నాకు అవకాశం వచ్చింది. "వెయ్యెందుకు బాస్, నాలుగు వంద లివ్వక."

బాస్ నవ్వి "అదంతేరా అబ్బులూ!

అవసరంకొద్దీ కొందరు, సంతోషం కొద్దీ కొందరు. ఎందరో మహానుభావులు, వారందరికీ వందనాలు పెట్టాలి "

బాస్ చాలా ప్రసన్నంగా కనిపిస్తున్నారు. శుభ్రంగా తలంటుకొని పూజ ముగించుకొని పాపిటమధ్య కుంకుమ పెట్టుకున్నారేమో దేదీప్యమానంగా వెలిగిపోతున్నారు.

"ఏవిట్రా తినేసేలా చూస్తున్నావు?"

"వట్టినే బాస్. మన చేతిలో పని కదా. కొందర్ని పాస్‌చేయించి కొందర్ని అట్టే పెడతారెందుకు. డబ్బు వాపస్ యిచ్చే ఖర్మెందుకు."

"పిచ్చివాడా సరే యిప్పటికైనా నీకు చెప్పితీరాలి. తలుపులు దగ్గరగా వేసిరా."

"యస్ బాస్" అని గంతులో వెళ్లి తలుపులు బిగించాను.

"విను మనం ఎవర్నీ పాస్ చేయించడంలేదు. అదంత తేలికకాదు. ఒక వారంరోజుల ముందు హైదరాబాదు, విశాఖపట్నం వెళ్ళి వాళ్ల కాళ్ళూ వీళ్ల కాళ్లూ పట్టుకొని పరీక్షా ఫలితాలు, మార్కులు తెలుసుకుంటున్నాం."

"నిజంగానా బాస్"

"మ రేమనుకున్నావ్"

"అయితే వీళ్లంతా ఎవరికి వాళ్లు పాసయినవాళ్లేనా?"

"అవును. కొందరు...ఎవరికి వాళ్ళు పాసవుతున్నారు. మిగతావాళ్ళు ఎవరికి వాళ్ళు ఫెయిలవుతున్నారు. యిందులో మన లిఫ్టేమీలేదు"

"గొప్పగా ఉంది బాస్."

"మనం పేరెంట్సుని హెచ్చరిస్తూ వస్తున్నాం ప్రతిసారీ. అబ్బాయి కష్టపడి చదవాలి. నాలుగైదు మార్కుల తేడాలో సాయం జరుగుతుందని."

"అవును."

"పిచ్చివాళ్లు. యింకెంత దూరం. బాగా కష్టపడి మొత్తం లాగించేస్తున్నారు యిట్టే పాసయి డబ్బు మనపరం చేస్తున్నారు."

"మరి పోయినవాళ్లు."

"చెబుతున్నాంగా సంజాయిషి, మళ్ళీసారి విజయం తథ్యమని భుజం తడుతున్నాం. రిజల్ట్సు రాకుండానే డబ్బు తిరిగి యిచ్చేస్తున్నాం. యింకేంకావాలి."

"ప్రజల వెర్రితనమే మన పెట్టుబడన్నమాట. వాళ్లెంత అమాయకులు బాస్."

"ప్రజలవరకూ ఎందుకురా. నీ మాట చెప్పు. నాతో ఉంటూ యిన్నాళ్లూ కనిపెట్టగలిగావా?"

"లేదు బాస్."

"అదీ మన వ్యాపార రహస్యం. జాగ్రత్త. మాట తూలితే మనం బోర్డు దించి శంకరగిరి మాన్యాలు పట్టాలి."

"అంత ఫూల్‌ని కాదు బాస్."

"కొంత ఫూల్‌వన్న మాటేగా".

యిద్దరం కడుపునిండా నవ్వుకున్నాం.